క్లుప్తంగా

భూసమస్యలపై వినతులు



ఆర్‌ఐ నల్లయ్యకు వినతులు అందజేస్తున్న ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ప్రజావేదికలో పలువురు భూసమస్యలపై వినతులు ఇచ్చారు. ముఖ్యంగా భూముల సర్వే, భూముల ఆన్‌లైన్ సమస్యలు, భూఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. రేషన్‌కార్డుల కోసం పలువురు వినతులను అందజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా భూసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గేటు వసూలు చేస్తే ఆందోళన



పంచాయతీ కార్యాలయం ఎదుట సంఘం సభ్యులు

రేణిగుంట: రేణిగుంటలో నిబంధనలకు విరుద్ధంగా గేటు వసూలు చేస్తే ఆందోళనకు దిగుతామని శ్రీబాలాజీ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు స్పష్టం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ లారీలకు గేటు రుసుము ఉండదని హైకోర్టు తీర్పు మేరకు జిల్లా పంచాయతీ అధికారి సర్క్యులర్ సైతం జారీ చేశారని వెల్లడించారు. అయినప్పటికీ లారీల నుంచి గేటు కాంట్రాక్టర్ అక్రమంగా రూ.400 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పంచాయతీ ఈఓకు ఫిర్యాదు చేస్తే, ఆయనకు కూడా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇదే విధంగా అధికారులు, కాంట్రాక్టర్ తీరు కొనసాగితే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. అసోసియేషన్ సభ్యులు నాగరాజు, షాన్ బాషా, శంకర్, లోకనాథం, శ్రీనాథ్, అన్వర్ బాషా, వెంకటేష్, ముని రాఘవ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు నాయుడు

శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడుగా మావిళ్లపల్లి వెంకటేశ్వర్లు నాయుడు సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేస్తానని వెల్లడించారు. కార్య క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నేతలు వయ్యాల కృష్ణారెడ్డి, వయ్యాల మనోహర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బావులూరు అంకయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసల కృష్ణయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఏర్పేడు: ఏర్పేడు- రేణిగుంట మార్గం ఏర్పేడు శివారున ఉన్న ఆమందూరు చెరువు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఆమందూరు చెరువు సమీపంలో ఫ్లైఓవర్ వంతెన వద్ద సుమారు 45-50 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు. మద్యం సేవించి ఎండకు అక్కడే పడి మృతి చెంది ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



బత్తిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ మాజీ సర్పంచ్ రోమాల బత్తిరెడ్డి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వెంటనే గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, గంగిరెడ్డి, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, దయారెడ్డి, రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

బండి ఆగె.. భారం పెరిగె..



రేషన్ బండి ద్వారా సరుకులు పొందుతున్న కార్డుదారులు

రెక్కాడితేగానీ డొక్కాడని దినసరి కూలీలు, గృహిణులు, వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ కోసం ఇబ్బంది పడకూడదనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. తద్వారా ప్రతినెలా తొలివారంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందేవి. అయితే పేదలకు ఎంతో ఉపయోగపడే ఇంత మంచి వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి సర్కారు
- రేషన్ సరుకుల కోసం షాపులకు వెళ్లాల్సిందే
- పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు అందించేలా ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వరదయ్యపాళెం: గత ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. 2021 ఫిబ్రవరిలో అప్పటి జగన్ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అట్టహాసంగా ప్రారంభించింది. అప్పట్లో సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలకు 56 ఎండీయూ వాహనాలను కేటాయించారు. పథకం ముఖ్య ఉద్దేశం నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించడంతో పాటు సుదూర గ్రామాల ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేయడమే. ఈ క్రమంలో వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం, ఇతర రేషన్ సరుకులను అందజేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం జూన్ నుంచి ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఎందుకు ఈ పథకాన్ని రద్దు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఒక ఊరి నుంచి మరో ఊరికి రేషన్ సరుకుల కోసం వెళ్లాలంటే తీవ్ర శ్రమతో కూడుకున్న అంశం. రేషన్ సరుకుల కోసం 2 నుంచి 3 కి.మీ. దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది..

ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు ఎండీయూ వాహనాల రద్దు వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బియ్యం మోసుకుని వెళ్లాలంటే సమస్యగా మారుతుంది. పేద వర్గాలకు చెందిన వారు ఆటోలు, ఇతర వాహనాల్లో చార్జీలు చెల్లించి సరుకులను ఇళ్లకు తీసుకెళ్లే పరిస్థితి ఉండదు.

సత్యవేడు నియోజకవర్గంలో కార్డుదారుల వివరాలు

మండలం	రేషన్ కార్డులు	ఎండీయూ	రేషన్ దుకాణాలు వాహనాలు
సత్యవేడు	15580	10	55
బీఎన్‌కండ్రిగ	11322	08	28
నారాయణవనం	11206	07	32
వరదయ్యపాళెం	15113	09	43
పిచ్చాటూరు	10232	07	32
కేవీబీపురం	13984	09	38
నాగలాపురం	10490	06	36
మొత్తం	87927	56	264

మోసుకుని రావాలి..



నాది వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలోని బీజీఆర్‌కాలనీ. టౌన్‌కు దూరంగా ఉన్న మా గిరిజనకాలనీలోకి గత ప్రభుత్వంలో రేషన్ వాహనంలో వచ్చి సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ వాహనాన్ని రద్దు చేస్తే వరదయ్యపాళెం టౌన్‌లోని రేషన్ దుకాణం–2కి కాలినడకన వెళ్లి సరుకులు తీసుకుని మోసుకుంటూ రావాలి. మాలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని రేషన్ బండ్ల రద్దును ఉపసంహరించుకోవాలి.

–అరకయ్య, బీజీఆర్‌కాలనీ

ఇంటి వద్దే అందించారు..



మాది వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌వై గిరిజనకాలనీ. 2019కి ముందు మా గ్రామం నుంచి 2 కి.మీ. దూరంలో ఉన్న చిన్నపాండూరుకు వెళ్లి సరుకులు తెచ్చుకునేవాళ్లం. అక్కడ డీలర్ ఎప్పుడు ఉంటాడో తెలియని పరిస్థితి. అనేకసార్లు రేషన్ వేసుకోకనే వచ్చిన రోజులు కూడా ఎన్నో. అయితే జగనన్న ప్రభుత్వంలో గత ఐదేళ్లు ప్రతి నెలా ఇంటి వద్దనే రేషన్ బండి ద్వారా సరుకులు అందుకున్నాం.

–చెంచమ్మ, వీకేఆర్‌వై గిరిజనకాలనీ

సరుకులు తీసుకోవడం కష్టమే



మేము రేషన్‌షాపునకు వెళ్లాలంటే 3 కి.మీ. దూరం వెళ్లాలి. మేము వెళ్లే సమయానికి డీలర్ ఉంటాడో లేదో తెలియదు. ఇకపై రేషన్ అందుకోవడం కష్టతరమే. కేవలం రాజకీయ కారణాలతోనే రేషన్ బండ్ల రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేదలకు అనుకూలంగా సరుకులు పంపిణీ చేస్తున్న వ్యవస్థపై ఇలాంటి కుట్రలు చేయడం సరికాదు.

–మురళి, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం

వృద్ధులకు కష్టమే..



ఇంటి ముందుకే బండి వచ్చి రేషన్ సరుకులు ఇచ్చి పోతుండడంతో నాలాంటి వృద్ధులకు ఎంతో సౌకర్యంగా ఉంది. బండిని తీసేస్తే రేషన్ షాపుకు వెళ్లి సరుకులు మోసుకొచ్చుకోవడం నాలాంటి వారికి కష్టమే. సరుకులు ఎప్పుడిస్తారని ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. డీలర్ ఉన్నప్పుడే వెళ్లాలి. అలా కాకుండా ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలి.

–రామమ్మ, చిన్న పాండూరు అరుంధతివాడ

3 కి.మీ. వెళ్లాలి



మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. 3 కి.మీ.ల దూరంలోని రాచర్ల గ్రామానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. బస్సులో పోతే మెయిన్ రోడ్డులో దిగి అక్కడ నుంచి మరో కి.మీ. కాలినడకన నడిచి వెళ్లాలి. మళ్లీ సరుకులు తెచ్చుకొని మళ్లీ మెయిన్ రోడ్డులోకి వచ్చి బస్సు ఎక్కి ఇంటికి చేరాలి. బస్సు చార్జీలు చెల్లించడమే కాకుండా ఇన్ని ఇబ్బందులు పడి తెచ్చుకోవడం నాలాంటి ఒంటరి మహిళలకు చాలా ఇబ్బంది.

–లక్ష్మమ్మ, చిన్న పాండూరు అరుంధతివాడ

వాహనాన్ని నిలిపివేయడం సరికాదు..



ఇంటింటికీ సరఫరా చేసే వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గం. రేషన్ షాపులకు వెళ్లకుండానే గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్నారు. ఇప్పుడు ఉన్నఫళంగా ప్రభుత్వం నిలిపి వేయాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న పథకాలను రద్దు చేయడం చంద్రబాబుకు అలవాటే.

–గురవయ్య, కళత్తూరు

వైఎస్సార్‌సీపీ నేతకు సత్కారం



మునికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ ఏర్పేడు మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన బండారుపల్లి మునికృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సోమవారం ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి పాతవీరాపురంలో నిర్వహిస్తున్న ధర్మరాజస్వామి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వాన పత్రిక అందించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెంబేటి మునిరత్నంరెడ్డి, వినోద్‌రెడ్డి, పురంధర్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ఎస్సీ, ఎస్టీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి స్థలాలు లేని అర్హులైన వారందరికి 3 సెంట్లు ఇంటి స్థలాలను పంపిణీ చేయాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ పార్టీ నాయకులు, ఎస్సీ, ఎస్టీలతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యవర్గసభ్యుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ మండలంలోని కారణి, కనమనంబేడు, వీఏస్‌పురం, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని ఈబీసీ కాలనీల్లో ఇంటి స్థలాలు లేని ఎస్సీ, ఎస్టీలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలిపారు. కూటమి నాయకులు ఎన్నికల్లో 3 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేకపోవడంతో ఒకే ఇంటిలో మూడు కుటుంబాల వారమని నివాసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పేదల కోసం ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

శ్రీకాళహస్తి: పేదలకు వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నేతలు మించల శివకుమార్, రొడ్డ గోపి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో దారుణమన్నారు. అద్దె ఇంట్లో ఉన్న నిరుపేదలు చాలీచాలని సంపాదనతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగానే పట్టణాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలన వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు మురళి, మల్లికార్జున, రాజయ్య, గంగమ్మ, మునెమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేణిగుంట: నిరుపేదలకు వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలు, నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. నేతలు తులసీరాజన్, వైఎస్ మణి, మురళి, కార్తీక్ పాల్గొన్నారు.

దారిని ఆక్రమించి షెడ్డు నిర్మాణం



ఏర్పేడు: మండలంలోని కోబాక దళితవాడలోని తమ ఇంటి వద్ద టీడీపీ స్థానిక నేత రామారావు దౌర్జన్యంగా దారిని ఆక్రమించి రేకుల్ షెడ్డు వేశాడని బాధితురాలు ధర్మమ్మ ఆరోపించారు. దీంతో తమ ఇంటికి రాకపోకలు సాగించేందుకు దారి లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

వాహన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు, యువకులకు వాహన చట్టాలపై సీఐ నాగార్జునరెడ్డి అవగాహన కల్పించారు. సోమవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్సు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కోరారు. చట్టాలను ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధిస్తామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరశురామేశ్వరుని సేవలో న్యాయమూర్తి



ఆలయంలో జడ్జి సత్యారావు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిని పరశురామేశ్వరస్వామివారిని సోమవారం విశాఖపట్నం ల్యాండ్ అక్విజేషన్ న్యాయమూర్తి ఎం.సత్యారావు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, పాలకమండలి మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ఘనంగా స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్దతు కోసం వినతి



మునిరామయ్యకు విన్నవిస్తున్న ఉచిత సేవకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏళ్ల తరబడి సేవలందించామని, వేతనం కోసం పోరాటం సాగిస్తున్న తమకు మద్దతుగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్యను ఉచిత సేవకులు కోరారు. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తమకు జీతభత్యాలు చెల్లించేందుకు తీర్మానం చేయించారన్నారు. దేవదాయశాఖ కమిషనర్ సైతం దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా జీతాలు ఇచ్చేందుకు అనుమతించారని వెల్లడించారు. ఇప్పుడు తమ పేర్లు కాకుండా, వేరే పేర్లతో ఆర్డర్ జారీ చేశారని వాపోయారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతర్ చేసి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. న్యాయమైన తమ పోరాటానికి సంఘీభావం తెలిపాలని విన్నవించారు. కార్యక్రమంలో అశోక్, రంగయ్య, వంశీ, తులసీరామ్, దామోదరం, గోపి, మునిబాబు, మాధవయ్య పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం



సేంద్రియ కూరగాయలను కొనుగోలు చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల వద్ద సోమవారం రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయాన్ని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీఏస్‌పురం, కనమనంబేడు గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరిపంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నారని తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను తింటే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. వరి, వేరుశనగ, వాణిజ్య పంటలను ప్రకృతి వ్యవసాయంలో రైతులు పండించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలను ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మున్నెయ్య, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, యూనిట్ ఇన్‌చార్జ్ జయలక్ష్మి, ఐసీఆర్‌పీ రేవతి, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు



సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల

సత్యవేడు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ వైద్యశాలలో గత మూడురోజులుగా జ్వరం పీడితులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రోజు వారి ఓపీ 30 నుంచి 40 మంది జ్వర పీడితులు ఉంటున్నారు. పలు గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టడంలో యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బోర్లు, బావుల్లో నీరు చేరడం, మురుగు గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో గ్రామాల్లో దోమలకు ఆవాసాలుగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఆస్పత్రిలో కరోనా కిట్లు అందుబాటులో లేవు. నాలుగు రోజులు పైగా జ్వరం ఉన్న రోగులు ఆందోళన చెందుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో కరోనా పరీక్షలు చేయించుకుంటున్నారు. జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థినులు

రేణిగుంట: స్థానిక జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో 2005-2009 బ్యాచ్ విద్యార్థినులు సోమవారం కలుసుకున్నారు. 16 ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సుజాత, పద్మజ, మునిరేణుక, సంగీత, జ్యోతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధిని, ఈశ్వరమ్మ, స్నేహ ప్రియ, కవిత పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

శ్రీకాళహస్తి: బార్లు, దాబాల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. సోమవారం బార్లు, దాబాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ దాబాల్లో ఆహార పదార్థాలు మాత్రమే విక్రయించాలన్నారు. మద్యం అమ్మినా అక్కడ తాగేందుకు అనుమతించినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బార్ల నిర్వాహకులు సమయ పాలన పాటించాలని సూచించారు.

కూటమి వైఫల్యాలను ఎండగడదాం

- 4న వెన్నుపోటు దినం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్
- పార్టీ నేతలతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిన తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన వరదయ్యపాళెంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని తెలిపారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాటిని అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ తరఫున ప్రతి కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. 7 మండలాల పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలసి ఈ నెల 4న వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, మణి నాయుడు (బీఎస్‌కండ్రిగ), ఎంపీపీ భర్త దామోదర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత కార్మికుల విభాగం సభ్యులు బొప్పన తిలక్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగుమూడి గురునాథం, రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి శివచక్రవర్తి, నాయకులు బందిల సురేష్, వినోద్ యాదవ్, దుద్దు వేణు, గిరి రెడ్డి, హరిబాబురెడ్డి, భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి మల్లికార్జున రెడ్డి, శివా యాదవ్, చంద్రారెడ్డి, బాలసుబ్రమణ్యం రెడ్డి, లోకేష్, అబ్దుల్ తదితరులు ఉన్నారు.